క్లుప్తంగా

అద్దంకి పరిశీలకులుగా మారం వెంకారెడ్డి


మారం వెంకారెడ్డి, అద్దంకి వైఎస్సార్ సీపీ పరిశీలకులు

చీమకుర్తి: అద్దంకి అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులుగా చీమకుర్తికి చెందిన మాజీ ఏఎంసీ చైర్మన్ మారం వెంకారెడ్డిని పార్టీ అధిష్టానం నియమించింది. ఈమేరకు గురువారం చీమకుర్తిలో మారం వెంకారెడ్డి మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గుర్తుంచుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు అద్దంకి పరిశీలకులుగా నియమించటం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. అద్దంకి నియోజకవర్గం తరఫున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి విశేష సేవలను అందిస్తానని ఈ సందర్భంగా వెంకారెడ్డి మీడియాకు తెలిపారు.

చీమకుర్తి సొసైటీ ప్రెసిడెంట్‌గా ఓబుల్‌రెడ్డి


గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి

చీమకుర్తి: చీమకుర్తి విశాల సహకార పరపతి సంఘం ప్రెసిడెంట్‌గా బండ్లమూడికి చెందిన గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. సొసైటీ త్రీమెన్ కమిటీ అధ్యక్షుడిగా ఓబుల్‌రెడ్డి, డైరెక్టర్లుగా మూలె వెంకటేశ్వరరెడ్డి, తోపూరి సుబ్బయ్యను నియమించారు. తనను సొసైటీ ప్రెసిడెంట్‌గా నియమించిన సందర్భంగా మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, స్థానిక ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించాలి

ఒంగోలు: ప్రభుత్వానికి పోస్టులు సరెండర్ చేసిన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని ఏపీ టీచర్స్‌గిల్డ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. మార్చి నెలలో ఆర్‌సీఎం సంస్థల్లో పనిచేసే 18 ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులకు, చీరాల ఆదినారాయణపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు, హనుమంతునిపాడు మండలం ఈదరవారిపల్లి ఉపాధ్యాయునికి, మద్దిపాడు మండలం బసవన్నపాలెం ఉపాధ్యాయులను యాజమాన్యాలు పోస్టులతో సహా ప్రభుత్వానికి సరెండర్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే నేటికీ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వారికి కౌన్సిలింగ్ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలకు సర్దుబాటు చేసేందుకు అధికారులు అలసత్వం వహిస్తున్నారని వెంటనే వారికి వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ముండ్లమూరు: మండలంలోని పెద ఉల్లగల్లు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. దొనకొండ మండలం తెల్లబాడుకు చెందిన బి.అజయ్ ద్విచక్ర వాహనంపై అద్దంకి వెళ్లి తిరిగి స్వగ్రామం వెళ్తుండగా దర్శి–అద్దంకి ప్రధాన రహదారిలో ఉల్లగల్లు వద్ద ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టాడు. ద్విచక్ర వాహనం లారీ ముందు భాగం కిందకు దూసుకెళ్లింది. ప్రమాదంలో అజయ్‌కు తీవ్ర గాయాలు కాగా 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. 108 సిబ్బంది నరేష్‌బాబు, బాలకృష్ణ, విజయ్ కుమార్‌లు ప్రథమ చికిత్స చేశారు.

ముమ్మరంగా ఓటర్ వెరిఫికేషన్ సర్వే

పుల్లలచెరువు: మండలంలోని పలు గ్రామాల్లో బీఎల్‌ఓలు గురువారం ఇంటింటికీ వెళ్లి ఓటర్ వెరిఫికేష్ సర్వే చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి చనిపోయిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, పెళ్లి చేసుకుని వెళ్లిన వారిని గుర్తించి వివరాలు నమోదు చేయాలని తహసీల్దార్ దాసు సూచించారు. ప్రతి బీఎల్వో తప్పని సరిగా వారికి కేటాయిచిన ఇళ్లలో తప్పక తనిఖీ చేయాలన్నారు. వెరిఫికేషన్ పక్కాగా జరగాలన్నారు. గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ నూతన ఓటుర్‌గా చేరేందుకు గ్రామాల్లో ఉన్న బీఎల్వోల వద్ద లేక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

త్రిపురాంతకం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండలంలోని నడిగడ్డలో శుక్రవారం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.పోలిరెడ్డి తెలిపారు. నడిగడ్డలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ హాజరవుతారు. మండలంలోని వైఎస్సార్ సీపీ అభిమానులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు హాజరు కావాలని కోరారు.

జగనన్న సురక్ష చారిత్రక ఘట్టం


సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్ గంగాడ సుజాత


చెరువుకొమ్ముపాలెంలో పోషకాహారం అందిస్తున్న మేయర్ గంగాడ సుజాత

- ప్రజల అవసరాలను గుర్తించి నెరవేర్చడంలో దేశానికే రాష్ట్రం ఆదర్శం
- నగర మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు: జగనన్న సురక్ష కార్యక్రమం ఒక చారిత్రక ఘట్టం అని నగర మేయర్ గంగాడ సుజాత అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సురక్ష కార్యక్రమంలో 1.46 కోట్ల మంది వివిధ రకాల పత్రాలను పొందారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఏవైతే హామీలు ఇచ్చారో వాటిని 95 శాతం నెరవేర్చడమే కాకుండా అదనంగా 36 పథకాలను ప్రవేశపెట్టి పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. అత్యధికంగా ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు 45 లక్షలమంది పొందారని, వాటి తోపాటు ఆదాయ, కుల, వయస్సు, మరణ ధ్రువీకరణ పత్రాలు వంటివి కూడా పొందారన్నారు. ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలో 70 సచివాలయాల పరిధిలో 1334 మంది వలంటీర్ల ద్వారా ప్రజల అవసరాలను తెలుసుకుని వారికి అవసరమైన 57404 పత్రాలను పంపిణీ చేయగలిగామని, ఇందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సింగరాజు మీనా కుమారి మాట్లాడుతూ గడప గపడకు కార్యక్రమం ద్వారా నిజమైన ప్రజల వద్దకు పాలనను ప్రజలు పొందగలిగారన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమస్యన్నింటినీ నిర్ణీత గడవు లోపల పరిష్కరించి సంబంధిత పత్రాలన్నీ ఒకేచోట ఇవ్వడం, పాల్గొన్న ప్రతి ఒక్కరికి సంతృప్తిగా భోజనం కూడా పెట్టడం రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. దున్నపోతు వద్ద ఎంత పితికినా పాలు రావని తెలిసే తెలుగుదేశం పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పారని విమర్శించారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, సాంస్కృతిక విభాగం రీజనల్ కోఆర్డినేటర్ బొట్ల సుబ్బారావు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం గురించి ప్రతి డివిజన్‌లో ఎటువంటి అంశాలను ప్రజలు ప్రస్తావిస్తున్నారు, ఇంకా ఏవైనా అదనంగా మనం పరిష్కరించాల్సిన అంశాలు ఉన్నాయా అంటూ నిత్యం తెలుసుకుంటూ సలహాలు, సూచనలు ఇవ్వడం వల్లే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించగలిగామన్నారు. గత ప్రభుత్వంలో ఏదైనా పత్రం కావాలంటే చివరకు జన్మభూమి కమిటీల రికమెండేషన్ కావాల్సి వచ్చేదని, కానీ నేడు అధికారులే ఇళ్లవద్దకు వచ్చి సమస్యను తెలుసుకుని పత్రాలను అందించడం అనేది దేశ చరిత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేయగలిగారన్నారు.

పోషక విలువలున్న ఆహారం తీసుకోండి

ఒంగోలు సిటీ: గర్భిణులు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని నగర మేయర్ గంగాడ సుజాత అన్నారు. గురువారం 18వ డివిజన్‌లోని చెరువుకొమ్ముపాలెంలో తల్లిపాల వారోత్సవాలు, జగనన్న సంపూర్ణ పోషణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ గంగాడ సుజాత పాల్గొని మాట్లాడారు. రక్తహీనత రాకుండా గర్భిణులు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. బాలింతలకు పసుపు, కుంకుమ ఇచ్చి జగనన్న సంపూర్ణ పోషణ పథకం ద్వారా వస్తున్న పాలు, గుడ్లు, కందిపప్పు, చిక్కిలు, అటుకులు, బెల్లం, వేరుశనగ ముద్దలు వంటి తదితరాలతో ఉన్న బ్యాగులను అందజేశారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. సీడీపీఓ ఫణిరాజకుమారి, సూపర్‌వైజర్ రమ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో లైంగిక దాడులు


జాత పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఉదయిని

ఒంగోలు టౌన్: మహిళలు, చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులు, అఘాయిత్యాలకు ప్రధాన కారణం మాదక ద్రవ్యాలు, మద్యమే అని ప్రముఖ వైద్యురాలు ఉదయిని అన్నారు. గురువారం హింసపై మహిళల పోరుయాత్ర వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం జాతా ప్రధాన ఉద్దేశాలను వివరించారు. ఒకప్పుడు నగరాలకు మాత్రమే పరిమితమైన మాదక ద్రవ్యాలు ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం, మత్తు పదార్థాలను నిషేధించాలని, హింస నివారణకు కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జూలై 28న ప్రారంభమైన రాష్ట్ర జాత ఆగస్టు 8న ముగిస్తుందని, ముగింపును పురస్కరించుకుని విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి తెలిపారు. మనువాదాన్ని అంతం చేయాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా నిందితులను కఠినంగా శిక్షించాలని, మహిళలు, చిన్నారుల రక్షణకు కఠిన చట్టాలను రూపొందించాలని ఈ జాతాలో ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ కల్యాణి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు యస్‌డీ షర్మిల, జిల్లా నాయకులు ఆళ్ల సీతా మహాలక్ష్మి, బి.రాజ్యలక్ష్మి, కె.రాజేశ్వరి.బి.పెద్ద గోవిందమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంతో ఇతరులకు జీవితం


ప్రతిజ్ఞ చేయిస్తున్న మహిళా అభ్యుదయ సమితి నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: జాతీయ అవయవదానోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒంగోలు హౌసింగ్ బోర్డులోని శక్తి సదన్ మహిళా ఆశ్రమంలో అవయవదానం ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. ఆంధ్రప్రదేశ్ మహిళా అభ్యుదయ సమితి ఆధ్వర్యంలో గురువారం తేళ్లఅరుణ అధ్యక్షతన సభ నిర్వహించారు. మరణానంతరం శరీరాన్ని దానం చేస్తే ఆ అవయవాలతో పదిమందిని బతికించవచ్చని మరణానంతరం కూడా జీవించి ఉండవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవవయదానానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని సంస్థ కోశాధికారి బీరం అరుణ ప్రతిజ్ఞ చేయించారు. కౌన్సిలర్ శనగపల్లి హరిశంకర్, సంస్థ డైరెక్టర్ కె.శాంతిలత, గుంటుపల్లి శ్రీదేవి, వేముల సుశీల, సీహెచ్ కనకదుర్గ, తక్కెళ్ల నరేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రామాలయ అభివృద్ధికి వితరణ


ఆర్థికసాయం చేస్తున్న సూర్య దివ్యాంగుల వ్యవస్థాపకుడు

ఒంగోలు మెట్రో: సత్యనారాయణపురంలో కొలువైయున్న అనంతకోదండరామ స్వామి దేవస్థాన అభివృద్ధి పనులకు సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, ఆల్ ఇండియా కళారంగం సకలవృత్తి కళారంగం జిల్లా అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ చేయూత ఇచ్చారు. లక్షా ముప్పెఫైడు వేల రూపాయిలను గురువారం తమ కార్యాలయంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వేమూరి శ్రీనివాసరావు సందిరెడ్డి ఆనందరావు, చల్లా నాగేశ్వరమ్మలకు అందించారు. చల్లా నాగేశ్వరమ్మ మాట్లాడుతూ చిన్న వయసులోనే భగవంతునిపై అచంచలమైన భక్తి విశ్వాసాలు కలిగి, సామాజిక సేవలు నిర్వహిస్తూ అనాథలు, అభాగ్యులు, పేదలకు విద్యార్థులకు చేయూతనిస్తున్న మండవ మురళీకృష్ణ ఆదర్శప్రాయుడని తెలిపారు. పాలపర్తి లక్ష్మీనారాయణ, అనపర్తి శివనాగేశ్వరరావు, పెళ్లూరు చిన్న వెంకటేశ్వర్లు, దేవరకొండ సుందర్ రావు, దేవరకొండ చిరంజీవి, సీహెచ్ రాంబాబు, చల్లా బాలకొండయ్య పాల్గొన్నారు.

మిరపనారు నర్సరీల పరిశీలన


కొలచనకోట వద్ద రికార్డులు తనిఖీ చేస్తున్న ఉద్యానవన శాఖ అధికారి ప్రత్యూష

మద్దిపాడు: మిరప నారు కొనుగోలు చేసే రైతులకు తప్పని సరిగా రసీదులు ఇవ్వాలని ఒంగోలు డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి ప్రత్యూష నర్సరీల యజమానులకు తెలిపారు. గురువారం కొలచనకోట, వెల్లంపల్లి, గుండ్లాపల్లి గ్రామాల పరిధిలో మిరప నారు సాగు చేస్తున్న నర్సరీలను పరిశీలించారు. యజమానులు సంబంధిత రిజిస్టర్‌లను పక్కాగా నిర్వహించకపోతే నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. నర్సరీల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నారు తీసుకునే రైతులు తప్పని సరిగా రసీదులు తీసుకోవాలన్నారు. కొందరు రైతులు బయట కంపెనీల ద్వారా విత్తనాల రసీదు లేకుండా కొనుగోలు చేస్తూ నర్సరీల్లో పెంచమని కోరుతారని అటువంటి రైతుల వద్ద తీసుకోవద్దని సూచించారు. నర్సరీ పేరు కనిపించేలా ప్రత్యేకంగా సూచికలు ఏర్పాటు చేయడంతో పాటు మొక్కల ధరలు పట్టిక ఏర్పాటు చేసి అందులో ప్రదర్శించాలన్నారు. నారు ఉత్పత్తి, అమ్మకాల వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. వీఏఏలు హరి తేజ, సాగర్, సాయి పాల్గొన్నారు.

దారిని ఆక్రమించిన వారిపై చర్యలు

కురిచేడు: గొర్రెలు మేపుకునేందుకు కొండకు వెళ్లే దారిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని, అలాగే దారిని విడగొట్టి గొర్రెల మేతకు ఇబ్బంది లేకుండా చూడాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘ జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు, రైతు సంఘ దర్శి డివిజన్ కార్యదర్శి సందు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సర్వే నంబర్ 77లో 19 ఎకరాల అసైన్‌మెంట్ భూమి ఉందని, ఈ భూమి మీదగా పూర్వం నుంచి బండి బాట ద్వారా కొండకు వెళ్లేందుకు దారి ఉండేదని, ఆ దారి ద్వారా పశువులు తోలుకుని వెళ్లే వారని, ఇటీవల పెత్తందారులు ఈ భూమిని బినామీ పేర్లతో తమ బంధువులకు పట్టాలు చేయించి దారిని ఆక్రమించి పశువులను రానివ్వడం లేదని విచారం వ్యక్తం చేశారు. పంట వేసిన సమయంలో పశువులు కొండకు వెళ్లడం తప్ప వేరే మార్గం లేదన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసినా ఫలితం లేదన్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ శ్రీకాంత్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ముప్వా శ్రీనివాసులు, తెల్లమేకల ఆంజనేయులు, రావులపల్లి గాలయ్య, వెంకటయ్య, మేకల పుల్లయ్య, మువ్వా గిరిబాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నాసా ప్రాజెక్టుకు శ్రీచైతన్య విద్యార్థుల ఎంపిక


నాసా ప్రాజెక్టుకు ఎంపికైన శ్రీచైతన్య విద్యార్థులు

ఒంగోలు: స్థానిక భాగ్యనగర్ కాలనీలోని శ్రీచైతన్య విద్యార్థులు 9మంది నాసా స్పేస్ సెటిల్‌మెంట్ ప్రాజెక్టుకు ఎంపికయ్యారని శ్రీచైతన్య విద్యాసంస్థల ఆర్‌ఐ అనీల్ తెలిపారు. 9మంది కలిసి ఈ ప్రాజెక్టును రూపొందించారన్నారు. వీరు చేసిన ప్రాజెక్టు జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతిని గెలుచుకుందని, కార్యక్రమంలో భాగంగా గెలుపొందిన వారికి జ్ఞాపికలను, సర్టిఫికెట్లు, మెడల్స్ అందించారు. ప్రిన్సిపాల్ హర్షవర్ధన్, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, డీన్ శివ, నాసా ఇన్‌ఛార్జి పి.బోయజ్, ఉపాధ్యాయులు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

విధుల నుంచి వలంటీర్ తొలగింపు

రాచర్ల: మండల కేంద్రం రాచర్ల ఎస్సీ కాలనీకి చెందిన క్లస్టర్–29లో విధులు నిర్వహిస్తున్న వలంటీర్ గుర్రం చంద్రశేఖర్ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ఆయన్ను తొలగిస్తున్నట్లు ఎంపీడీవో కె.కవితా చౌదరి గురువారం తెలిపారు. అగస్టు 1వ తేదీన పింఛన్‌ల పంపిణీ సహకాలంలో చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వెల్ఫేర్ అసిస్టెంట్ కాశీరావు ద్వారా పింఛన్‌లు పంపిణీ చేయించారు. చంద్రశేఖర్ గతంలో పింఛన్ సొమ్మును బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రలు వేయించకుండానే పింఛన్‌దారులకు పింఛన్ పంపిణీ చేశాడని, ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరనాయక్ విచారించడంతో అతని విచారణ మేరకు గ్రామ వలంటీర్ చంద్రశేఖర్‌ను పూర్తిగా విధుల నుండి తొలగించినట్లు ఎంపీడీవో కవితా చౌదరి తెలిపారు.

పల్లెవనం పార్కును పరిశీలించిన డీఎఫ్ఓ

దర్శి: దర్శి పల్లెవనం పార్కును డీఎఫ్ఓ కె.మోహన్‌రావు గురువారం సందర్శించారు. డీఎఫ్ఓతో పాటు రేంజ్ అధికారి కేవీ నాగేంద్రరావు, సెక్షన్ అధికారి మోహన్‌రావు, ఒంగోలు బీట్ అధికారి శశిభూషణ్ యాదవ్‌లు కూడా హాజరయ్యారు. గతంలో మాదిరిగానే పార్కులో జరుగుతున్న పనులు పరిశీలించారు. ఇక్కడ పనులు పూర్తయ్యాయా లేదా...అనే వివరాలు కానీ..ఇక్కడ జరిగిన రూ.45 లక్షల అవినీతి గురించి కానీ విలేకరులు ప్రశ్నించినా అధికారులు నోరు విప్పడం లేదు. గతంలో స్క్వాడ్ డీఎఫ్ఓ మారుతి ప్రసాద్ వచ్చినప్పుడు కూడా ఇదే తంతు కొనసాగించారు. ఎవరు వచ్చినా మౌనమే సమాధానం కావడంతో అవినీతి నిజమే అన్న అనుమానాలకు బలం చేకూరుతోంది.

54 వేలకు పైగా సర్టిఫికెట్ల పంపిణీ


జగనన్న సురక్ష కార్యక్రమం వివరాలను వెల్లడిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చీమకుర్తి: జగనన్న సురక్ష కార్యక్రమం సూపర్ సక్సెస్ అయిందని ఏఎంసీ చైర్మన్ మారెళ్ళ బంగారుబాబు, చీమకుర్తి జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు గోలి తిరుపతిరావు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి వారు గురువారం ఒంగోలులోని ఎమ్మెల్యే టీజేఆర్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 90 శాతం పైగా సంక్షేమ కార్యక్రమాలను అమలు పరిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో 54 వేలకు పైగా సర్టిఫికెట్లు అందించిన గణాంక పత్రాలను వెల్లడించారు.

గడప గడపను అడ్డుకోవడం దుర్మార్గం

ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పేర్నమిట్టలోని 41వ డివిజన్‌లో మంగళవారం నిర్వహించిన గడప గడప కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అని మారెళ్ళ బంగారు బాబు, వేమా శ్రీనివాసరావు, గోలి తిరుపతిరావు అన్నారు. ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకునే క్రమంలో ఒక బాజరుకు చెందిన కొంతమంది టీడీపీ నాయకులు అడ్డుకోవడం సరైంది కాదని హెచ్చరించారు. మండలాల కన్వీనర్‌లు పోలవరపు శ్రీమన్నారాయణ, మండవ అప్పారావు, పమిడి వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు దుంపా యలమందారెడ్డి, కోయ హనుమయ్య, రమణారెడ్డి, త్రినాథ్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


మహిళకు కిట్టు అందజేస్తున్న ఒంగోలు ప్రాజెక్ట్ సూపర్‌వైజర్, కార్పొరేటర్, ఏఎన్ఎం సిబ్బంది

ఒంగోలు రూరల్: స్త్రీ సంక్షేమశాఖ సమగ్ర శిశు అభివృద్ధి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో టేక్ హోం రేషన్ ప్రారంభ కార్యక్రమం సూపర్‌వైజర్ మండువ అనురాధ అధ్యక్షతన గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నగర కార్పొరేటర్ కోటపూరి సామ్రాజ్యం మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అవసరమని ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కిట్ అందజేస్తోందన్నారు. డివిజన్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మాట్లాడుతూ గతంలో అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం ఏర్పాటు చేసేవారని వారి ఇబ్బందుల దృష్ట్యా టేక్ హోమ్ రేషన్ కిట్లు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఈ పథకం ద్వారా రక్తహీనత లేకుండా బలవర్ధక ఆహారం శరీరానికి అందుతుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు కోటపూరి ప్రభాకర్‌రావు, ఎ.రవికుమార్, ఏఎన్ఎం రోహిణి, అంగన్వాడీ కార్యకర్తలు వై.కోటేశ్వరమ్మ, అనూష, సిబ్బంది మాధురి, అనూష, ఆశ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

వైఎస్సార్ కిట్లతో ఉపయోగం

నాగులుప్పలపాడు: బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉండి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండే బిడ్డలను పెంచడానికి వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా ప్రభుత్వం మంచి అవకాశం కల్పించిందని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం అమ్మనబ్రోలు గ్రామంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం రేషన్ కిట్లు పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఎంపీడీవో జయమణి, తహసీల్దార్ సుజన్ కుమార్, లిడ్ క్యాప్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కంచర్ల సుధాకర్, సర్పంచ్‌లు బత్తుల రవీణ, ఘట్టమనేని అశోక్, శివ నాగరాజా, ఉషారాణి, శ్రీదేవి, సెక్రటరీ వీరయ్య పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ విజయవంతం చేయండి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డాక్టర్ సురేష్, సిబ్బంది

కొత్తపట్నం: ఈ నెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా లెప్రసీ, టీబీ డాక్టర్ డి. సురేష్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నులిపురుగుల నివారణపై ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాల హెచ్‌ఎంలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సురేష్ మాట్లాడుతూ 1వ సంవత్సరం నుంచి 16 సంత్సరాల వయస్సు గల పిల్లలు, విద్యార్థులందరికీ నులి పురుగుల మాత్రలు వేసుకోవాలని సూచించారు. అన్ని స్కూల్స్, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రయివేటు స్కూల్స్‌లో, హాస్టల్‌లో పిల్లలందరికీ ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు మాత్రలు పంపిణీ చేయటమేకాక దగ్గరుండి మింగించాలన్నారు. కొత్తపట్నం, ఈతముక్కల పీహెచ్ సెంటర్ పరిధిలో 11,700 మందికి లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఎంపీడీవో పి.సుజాత, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వైష్ణవి, ఎంఈవో–2 పద్మావతి, సీహెచ్‌వో ఓంకార్, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డుకు భూమి పూజ


నూతనంగా నిర్మించబోతున్న సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సిటీ: నగరపాలక సంస్థ పరిధిలోని 15వ డివిజన్ రాంనగర్ 6వ లైన్‌లో నూతనంగా నిర్మించబోతున్న సిమెంట్ రోడ్డుకు మేయర్ గంగాడ సుజాత గురువారం భూమిపూజ నిర్వహించారు. వర్షంపడితే ఆ రోడ్డు మార్గాన వెళ్లలేకపోతున్నామని స్థానిక ప్రజలు కార్పొరేటర్ చింతపల్లి గోపి, మేయర్ సుజాత దృష్టికి తీసుకురాగా, స్పందించిన మేయర్ రూ.25 లక్షల రూపాయిల వ్యయంతో నూతన సీసీ రోడ్డుకు ప్రణాళికలు సిద్ధం చేసి మేయర్ భూమిపూజ నిర్వహించారు. నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించాలని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా త్వరగా రోడ్డును నిర్మించాలని మేయర్ గంగాడ సుజాత కార్పొరేషన్ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. మున్సిపల్ ఇంజనీరు మాల్యాద్రి, డివిజనల్ ఇంజనీరు రఘురాం, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.